క్లుప్తంగా

పంట నమోదు పరిశీలన

కృష్ణగిరి: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ యాప్‌లో నమోదు చేయడంలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని తహసీల్దార్ రాజేశ్వరి ఆదేశించారు. కంబాలపాడు గ్రామ పరిధిలో పంట నమోదు చేసిన పొలాలను మంగళవారం ఆమె సూపర్ చెక్ చేశారు. పంట నమోదును ఈ యేడాది జియో ఫెన్సింగ్ యాప్‌లో నమోదు చేయడం జరిగిందని, అందులో తప్పులు జరిగితే వ్యవసాయ సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

ల్యాండ్ కన్వర్షన్ పక్కాగా చేపట్టండి



ధర్మాపురంలో భూ రికార్డులను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

నందవరం: రెవెన్యూ అధికారులు ల్యాండ్ కన్వర్షన్‌ను పక్కాగా రికార్డులలో నమోదు చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం నందవరంతో పాటు ధర్మపురం గ్రామాల్లో పర్యటించి లాండ్ కన్వర్షన్, పంట నమోదును సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సమగ్ర రీ సర్వేతో పాటు ల్యాండ్ కన్వర్షన్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మండలంలో పంట నమోదు 99 శాతం పూర్తయిందని, రైతులతో ఈ–కేవైసీ కూడా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ నిత్యానందరాజు, ఆర్ఐ జెర్మియా, మండల సర్వేయర్ అబ్బర్‌బాషా, వీఆర్వోలు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం నరసప్ప అభినందించారు. ఆయన మాట్లాడుతూ కర్నూల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావటం చాల సంతోషంగా ఉందని తెలిపారు. అండర్–14 వాలీబాల్ పోటీలకు ఉదయ్, భూమిక, అండర్–17లో మౌనిక, చంద్రిక ఎంపికైనట్లు చెప్పారు. అలాగే అండర్–14 హాకీ పోటీలకు శివనాగ చైతన్య ఎంపికైనట్లు తెలిపారు.

నవరత్నాలతో ప్రతి ఇంటికీ లబ్ధి



గురజాలలో సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

నందవరం: దేశంలోనే ఆదర్శ పాలనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిదర్శనంగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. మంగళవారం నందవరం మండలం గురజాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, అందిన సాయంపై ఆరా తీశారు. 174 గృహాలను సందర్శించి ప్రజల అవసరాలు, ప్రభుత్వ పథకాల లబ్ధి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. అనంతరం ఉపాధికూలీలకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. అలాగే సచివాలయం, ఆర్బీకే కేంద్రాలను తనిఖీ చేశారు. సర్పంచ్ వీరస్వామి, నాయకులు నరసింహారెడ్డి, చిన్న నరసింహారెడ్డి, పెద్ద నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సారా, అక్రమ మద్యంపై నిఘా

ఆలూరు: హొళగుంద మండలంలోని దేవరగట్టులో విజయదశమి పండుగ సందర్భంగా నాటు సారా, కర్ణాటక మద్యం రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలతో నిఘా ఉంచినట్లు ఆలూరు సెబ్ సీఐ ఎర్రవెంకట్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10వ తేదీ నుంచి విజయవాడ నుంచి స్పెషల్ టాస్క్ ఫోర్స్, మొబైల్ స్క్వాడ్ టీంలు రంగంలోకి దిగుతాయని, సరిహద్దులో మరో 6 ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలో ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు.

నేడు వైద్య శిబిరాలు

ఆలూరు రూరల్/ఎమ్మిగనూరురూరల్/తుగ్గలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు ఆలూరు సచివాలయం–3 పరిధిలోని ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో, ఎమ్మిగనూరు మండల పరిధిలోని దేవబెట్ట గ్రామంలో, తుగ్గలి మండల పరిధిలోని మారెళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు అల్లబకాష్, బంగారమ్మ, సావిత్రి తెలిపారు. తుగ్గలిలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవకుమార్, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరవుతారని పేర్కొన్నారు. ఆయా శిబిరాల్లో పాల్గొని ప్రజలు వైద్య సేవలు పొందాలని సూచించారు.

నేడు వాహనాల వేలం

ఎమ్మిగనూరురూరల్: సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన కార్లు, ఆటోలు, మోటార్ బైకులను బుధవారం డీఎస్పీ కార్యాలయం ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు టౌన్ సీఐ మధుసూదన్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- విస్తృతంగా జగనన్న సురక్ష వైద్య శిబిరాలు
- సద్వినియోగం చేసుకుంటున్న ప్రజానీకం
- మెరుగైన వైద్య సేవలపై హర్షం



రాతనలో వృద్ధురాలికి కళ్లజోడు పెడుతున్న ఎమ్మెల్యే శ్రీదేవి



అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

తుగ్గలి: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం రాతనలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగనన్న విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పేద, మధ్య తరగతి ప్రజల ఉన్నతికి కృషి చేస్తున్నారన్నారు. వైద్య నిపుణులను గ్రామాలకే రప్పించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. శిబిరంలో చికిత్స చేయించుకున్న వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం ఇచ్చే పప్పుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, నాగేష్, సర్పంచ్ రాచప్ప, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ టీఎండీ హుసేన్, మండల కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌బాషా, ఎంపీటీసీ శ్రీదేవి, అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్దికెర: రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా వుండాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలు చేసి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం ఎం.అగ్రహారం గ్రామంలో వైద్య శిబిరాన్ని పరిశీలించి వైద్యం కోసం వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంత ఖర్చయినా వెనుకాడకుండా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, సర్పంచ్ విజయుడు, కన్వీనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ నరసింహమూర్తి, వైద్యులు నగేష శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ: మునుపెన్నడూ లేనంతగా ఈ ఏడాది రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలు అందజేస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేశారు. ఏఓ రవి, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి ,సొసైటీ అధ్యక్షులు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే నూతనంగా ఎంపికైన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంపల వెంకటేశులును అభినందించారు.

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని దేవనబండ గ్రామంలో మంగళవారం సర్పంచ్ పొట్లపాటి ప్రవీణ అధ్యక్షతన ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష హెల్త్ క్యాంపునకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఎంపీపీ నారాయణదాస్, తహసీల్దారు విష్ణుప్రసాద్, ఎంపీడీఓ కవిత, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంగడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

ఎమ్మిగనూరుటౌన్: అందరికీ ఆరోగ్యం అందించాలన్న తలంపుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు ఒక వరం లాంటిదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని గోనెగండ్ల రోడ్డు ఖిబులా అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిబిరంలో వైద్య సిబ్బంది ప్రతిఒక్కరి ఆరోగ్య స్థితిని తెలుసుకొని మెరుగైన వైద్య సేవలందిస్తారని, అవసరమైన వారిని కర్నూలుకు రెఫర్ చేసి శస్త్ర చికిత్సలు చేయిస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి ప్రసంగించగా వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బుట్టారంగయ్య, మున్సిపల్ డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, ఆర్ఓ బేబి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పోషకాహార స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.



ఎమ్మిగనూరులో సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం

- స్పెషలిస్టు వైద్యులచే ఉచితంగా వైద్య సేవలు
- కంటి పరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాల అందజేత
- ఆయుష్మాన్ భవ హెల్త్ కార్డుల పంపిణీ
- ఈసీజీ లాంటి సేవలు సైతం ఉచితం



గోవర్ధనగిరి హెల్త్ క్యాంప్‌లో ఈసీజీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది



కంబాలపాడులో శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు



ములుగుందంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య

వెల్దుర్తి: రాష్ట్ర ప్రజలందరు ఆరోగ్యంగా ఉండాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గోవర్ధనగిరిలో మంగళవారం స్పెషలిస్ట్ వైద్యులచే నిర్వహించిన హెల్త్ క్యాంప్ విజయవంతమైంది. గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్–1 పరిధిలో జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన హెల్త్ క్యాంప్‌లో దాదాపు 500 మంది వైద్య సేవలు పొందారు. పీహెచ్‌సీ డాక్టర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీధర్ రెడ్డి, రామళ్లకోట పీహెచ్‌సీ డాక్టర్ భువనతేజ, కర్నూలు జీజీహెచ్ జనరల్ మెడిసిన్ విభాగం వైద్యాధికారి డాక్టర్ భరత్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్, కిమ్స్ రెయిన్‌బో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అన్నపూర్ణ వైద్య సేవలందించారు. ఈసీజీ పరీక్షలు చికిత్స అందించారు. కంటి వెలుగు డాక్టర్ కవిత పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈఓఆర్డీ నరసింహులు, వైస్ ఎంపీపీ రంగడు, సర్పంచ్ ఎల్లరాముడు వైద్యులతో కలిసి పలువురికి కంటి అద్దాలు, ఆయుష్మాన్ భవ హెల్త్ కార్డులు అందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆస్పరి: సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య సూచించారు. మంగళవారం ములుగుందం గ్రామంలో నిర్వహించిన శిబిరాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ పరిశీలించారు. రోగులు, డాక్టర్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ములుగుందంలో 320 మంది రోగులను పరీక్షించి మందులు అందజేసినట్లు డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. సర్పంచ్ శ్యామలమ్మ, డాక్టర్లు పుష్పలత, ప్రణయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణగిరి: కంబాలపాడు గ్రామంలో వైద్యాధికారి ప్రదీప్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 355 మందికి వైద్యసేవలు అందించినట్లు డాక్టర్ ప్రదీప్ తెలిపారు. 25 మంది విద్యార్థినులు, 42 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కొందరికి వెంటనే కళ్లద్దాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ విశ్వమోహన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గోనెగండ్ల: ఒంటెడుదిన్నె గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్ పరిశీలించారు. డాక్టర్లు అపర్ణ, కార్తిక్, ఈశ్వర్, దామోదర్ గ్రామస్తులకు ఏడు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ కేశవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాశీ రెడ్డి ఎంపీహెచ్‌ఈఓలు, ఎన్ఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: ఏనుగుబాల గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దైవందిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ క్యాంప్ జరిగింది. పీహెచ్‌సీ డాక్టర్లు అపర్ణ, మహేశ్వరప్రసాద్ ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. నలుగురిని ఆపరేషన్ కోసం రెఫర్ చేశారు. డాక్టర్లు యామిని, వసుంధర, సూపర్‌వైజర్ సురేష్, ఎంఈఓ ఆంజనేయులు, డీటీ గురురాజరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హొళగుంద: 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ప్రజల ఆరోగ్యానికి భరోసా కలుగుతుందని హొళగుంద, గజ్జహళ్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు న్యూటన్, బిందుమాధవి అన్నారు. మంగళవారం హొళగుందలో వైద్య శిబిరం నిర్వహించి దాదాపు 500 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

హాలహర్వి: గూళ్యం గ్రామంలోని సచివాలయం–1 పరిధిలో వైద్య శిబిరాన్ని తహసీల్దార్ మల్లికార్జున, ఎంపీడీఓ ఆంతోనీ, జెడ్పీటీసీ లింగప్ప చేతులమీదుగా ప్రారంభించారు. అలాగే ఆకుకూరలు, చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని అధికారులు స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.

దేవనకొండ: ప్రజల ఇంటి ముంగింటకే వైద్యం అందుతుందని జెడ్పీటీసీ రామకృష్ణ, తహసీల్దార్ వెంకటేష్ నాయక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం దేవనకొండలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యుడు విజయభాస్కర్ రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు.

నందవరం: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి అన్నారు. మంగళవారం కనకవీడు గ్రామ సచివాలయంలో సర్పంచ్ మద్దీశ్వరి, వైస్ ఎంపీపీ షేక్ సాహెబ్ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు ప్రారంభించారు. డాక్టర్లు చంద్రకాంత్ యాదవ్, విజయ భారతి, భార్గవి, ఎముకల డాక్టర్ బాలకృష్ణ దాదాపు 490 మందికి వైద్య సేవలు అందించారు. 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 62 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ నిత్యానంద రాజు, ఎంపీడీఓ దశరథ రామ య్య, సీహెచ్‌ఓ బలరాం తదితరులు పాల్గొన్నారు.



గోవర్ధనగిరి హెల్త్ క్యాంపులో బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేయించుకున్న ప్రజలు



ఒంటెడుదిన్నెలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్,తహసీల్దార్ వేణుగోపాల్



గూళ్యం వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు విజయభాస్కర్

పేదలకు మంచి చేసే ప్రభుత్వం



నేను ఆస్తమాతో బాధపడుతున్నాను. వ్యయప్రయాసలు పడి కర్నూలు, గుంతకల్లుకు వెళ్లి ఆస్పత్రిలో చూపించుకునే వాన్ని. ఇప్పుడు జగనన్న సురక్షతో ఊళ్లోనే వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు ఇచ్చారు. ఇలాంటి కార్యక్రమం అప్పుడప్పుడు చేస్తే చాలా బాగుంటుంది. ప్రభుత్వం పేదల కోసం ఎన్నో మంచి పనులు చేస్తోంది.

– ఏరూరు రామాంజినేయులు, రాతన

పరీక్షలు చేసి మందులు ఇచ్చారు



నాకు నడిచేందుకు చేత కావడం లేదు. కాళ్ల నొప్పులున్నాయి. సిబ్బందే వైద్య శిబిరానికి తీసుకొచ్చి పెద్ద డాక్టర్లకు చూపించి ఆరోగ్య పరీక్షలు చేయించారు. ఉచితంగా మందులు ఇచ్చారు. ఇలా వైద్యం అందించడం ఎప్పుడు చూడలేదు. – లక్ష్మి, వడ్డె సంఘం ఏరియా, ఎమ్మిగనూరు

రూ.10 వేల వరకు డబ్బు ఆదా



నాకు మోకాళ్ల నొప్పులు, షుగర్, బీపీ ఉంది. ప్రతినెలా కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి ఆస్పత్రికి వెళ్లి చికిత్సలు తీసుకునే దాన్ని. బళ్లారి ఆస్పత్రికి పోయినప్పుడల్లా డాక్టర్ ఫీజు, మందుల ఖర్చులతో కలిపి రూ.10 వేల దాకా ఖర్చు అయ్యేది. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంతో ఆ ఖర్చులన్నీ మిగిలిపోయాయి.

– ఉలిగమ్మ, గూళ్యం గ్రామస్తురాలు

పట్టణానికి వెళ్లే బాధ తప్పింది



నేను శిబిరానికి వెళ్లి బీపీ, అలర్జీ ఉందని చెప్పగా డాక్టర్లు ఆయా పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం వల్ల మాలాంటి వృద్ధులకు ఎంతో మేలు. పెద్ద డాక్టర్లతో చూపించుకోవాలంటే పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇక బాధ లేకుండా పోయింది. గ్రామాలలో చాలా మందికి ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– నధీమ్‌బేగ్, ములుగుందం గ్రామం, ఆస్పరి మండలం

అన్ని పరీక్షలు ఒకే చోట చేస్తున్నారు



నాకు గత నెల రోజులుగా మెడ నరాలు పట్టేయడంతో చాలా ఇబ్బంది పడ్డాను. మెరుగైన వైద్యం కోసం వెళ్లాలంటే డోన్ లేదా కర్నూలుకు వెళ్లాలి. ఇంతలోనే ఆరోగ్య సిబ్బంది మా ఇంటికి వచ్చి సర్వే చేయడంతో నా సమస్య చెప్పాను. వారి సూచనతో మంగళవారం శిబిరానికి రాగా ముందుగా బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. తర్వాత డాక్టర్ వద్దకు వెళ్లి చూపించుకోగా పరీక్షించి సమస్యకు తగిన మందులు ఇచ్చారు. ముందు జాగ్రత్తగా కంటి పరీక్ష కూడా చేయించుకున్నా. జగనన్న పుణ్యమా అని గ్రామంలోనే అన్ని రకాల వైద్యసేవలు అందించడం సంతోషంగా ఉంది.

– రమాకాంత్, గుడెంపాడు

బీపీ, షుగర్‌కు మందులిచ్చారు



నేను ప్రతి నెలా కర్నూలు లేదా వెల్దుర్తికి వెళ్లి వందల రూపాయలు ఖర్చు చేసి బీపీ, షుగర్ మందులు తెచ్చుకునేవాడిని. అలాంటిది ఈ రోజు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై నమ్మకంతో క్యాంపుకు వచ్చి పరీక్షలు చేయించుకున్నాను. వైద్యులు పరీక్షలు చేసి నెలకు సరిపడా బీపీ, షుగరు మందులు ఉచితంగా ఇచ్చారు. కర్నూలుకు పోయి, వచ్చే తిప్పలు తప్పినాయి. డబ్బులు మిగిలినాయి.

– శివయ్య, గోవర్ధనగిరి, వెల్దుర్తి మండలం

11 నుంచి ఎల్లార్తి ఉరుసు



ఉరుసు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామంలో వెలసిన షేక్షావలి, షాషావలి 361వ ఉరుసును కులమతాలకు అతీతంగా ప్రశాంతంగా జరుపుకోవాలని మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. మంగళవారం రాత్రి మంత్రి నివాసంలో ఎల్లార్తి దర్గాల ఈఓ అబ్దుల్ రహీమ్ సమక్షంలో ఉరుసు పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ.. అందరూ కలసికట్టుగా భక్తిశ్రద్ధలతో ఉరుసు జరుపుకోవాలన్నారు. 11 నుంచి 13వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిణి పరీ వ్‌స్‌భాను, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ముస్లిం నాయకులు, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మల్లికార్జున తదితరులు ఉన్నారు.

ప్రయాణికుల భద్రతే ధ్యేయం కావాలి

ఆలూరు: ప్రజలు, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా వాహన డ్రైవర్లు పని చేయాలని మంత్రి గుమ్మనూరు జయరాం సూచనలు చేశారు. నియోజకవర్గంలోని డ్రైవర్లకు వాహనమిత్రం పథకం కింద రూ.10 వేలు ప్రభుత్వ సాయం అందడంతో మంగళవారం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి గుమ్మనూరు జయరాంకు స్వీట్లు తినిపించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.10 లక్షల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.

మార్గం సుగమం

తుగ్గలి: ఈ చిత్రంలో కనిపిస్తున్నది చెన్నంపల్లి–రామలింగాయపల్లి మధ్య రోడ్డు. జొన్నగిరి నుంచి పెండేకల్లు రైల్వే జంక్షన్ వరకు చాలా చోట్ల రోడ్డు దెబ్బతిన్నా గత పాలకులు పట్టించుకోలేదు. రోడ్డుపై ప్రయాణించేందుకు వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. తరచూ వాహనాలు పాడయ్యేవి. వ్యయ ప్రయాసలు తప్పేవి కావు. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక చొరవ చూపారు. రోడ్డు మరమ్మతులకు మార్కెట్ యార్డు అభివృద్ధి నిధులు రూ.1.99 కోట్లు మంజూరు చేయించారు. ఆ నిధులతో చేపట్టిన రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయి. మార్గం సుగమం కావడంతో ప్రజలు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెబుతున్నారు.



నేడు– రాకపోకలకు అనువుగా తారు రోడ్డు నిర్మించిన దృశ్యం



నాడు– చెన్నంపల్లి–రామలింగాయపల్లి మధ్య రోడ్డు దుస్థితి

పిచ్చికుక్క స్వైర విహారం



గాయపడ్డ బాలుడు సాయి

మద్దికెర: స్థానిక సాయినగర్‌లో పిచ్చి కుక్క స్వైర విహారం చేసి ఇద్దరిని గాయపరిచింది. మంగళవారం వీధిలో ఆడుకుంటున్న సాయి అనే పిల్లాడిని ముఖంపై కరవడంతో అక్కడున్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. అలాగే ఇబ్రహీం అనే ఉపాధ్యాయుడిని కుక్క కరవడంతో ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందారు.

సారా విక్రేతల అరెస్ట్

వెల్దుర్తి: కోడుమూరు సెబ్, స్థానిక పోలీసులు మంగళవారం వెల్దుర్తి, కలుగొట్ల గ్రామాల్లో దాడులు నిర్వహించి ఇద్దరు మహిళలు నాటుసారా విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వారి నుంచి నుంచి 11 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించామన్నారు.

జీడీపీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



జీడీపీ ఆనకట్ట పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా పశ్చిమ ప్రాంతానికి సంజీవినిగా ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) అభివృద్ధికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. జీడీపీ ఆనకట్ట పెంపునకు ప్రభుత్వం రూ.57.34 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో జీడీపీలో జరుగుతున్న ఆనకట్ట ఎత్తు పెంపు, క్రస్ట్ గేట్ల పనులను ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, నీటిపారుదల శాఖ ఈఈ శైలేశ్వర్ రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వివరాలు ఆరా తీయగా జీడీపీలో ప్రస్తుతం 1.6 టీఎంసీల నీటి నిల్వ ఉందని, ఆనకట్ట ఎత్తు పెంపు, క్రస్ట్ గేట్ల పనులు మరో మూడు నెలల్లో పూర్తవుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయితే మరో 10 వేల ఎకరాలకు సాగునీటితో పాటు ఎమ్మిగనూరు, కోడుమూరు, డోన్ తదితర పట్టణాలకు తాగునీటి సమస్య కూడా తీరనుందని తెలిపారు. జీడీపీ ఎగువ ప్రాంతం గోనెగండ్ల, ఐరన్‌బండ, ఎన్నకండ్ల గ్రామాల్లోని రైతులు తమ పొలాలు జీడీపీలో మునకకు గురైతే నష్టపోతామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన భూములిచ్చిన రైతులకు తగిన పరిహారం అందించి న్యాయం చేస్తామన్నారు. డీఈలు లక్ష్మణ కుమార్, విజయకుమార్, ఏఈ ఆలీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బందె నవాజ్, కాశీరెడ్డి, ధర్మకారి నాగేశ్వర రావు, గోవింద్, వీరరెడ్డి, రాముడు, మాబువలి, నదిమూల్లా తదితరులు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఏర్పాటు చేసిన పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన పశువ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేను పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు రామచంద్రయ్య, ఆదోని ఏడీ సుబ్రహ్మణ్యం తదితరులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంచార పశు వైద్య సేవ, పాడి అభివృద్ధికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. గోనెగండ్ల ఏడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.